క్లుప్తంగా

జెన్‌కో ఉద్యోగులకు డీఏ మంజూరు చేయాలి

పాల్వంచ: టీఎస్ జెన్‌కోలో పనిచేస్తున్న ఉద్యోగ, ఆర్టిజన్ కార్మిక, సిబ్బందికి, సర్వీస్ పెన్షనర్లకు, ఫ్యామిలీ పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న డీఏ వెంటనే విడుదల చేయాలని తెలంగాణా స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఎ.వజీర్ కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో విద్యుత్ సౌధ నందు సీఎండీ డి.ప్రభాకర్ రావును కలిసి వినతి పత్రాన్ని అందించారు. జూలై నెల నుండి డీఏ రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

కబ్జాలపై విచారణ జరపాలి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం నియోజకవర్గంలో భూకబ్జాదారులపై తక్షణమే సీబీఐతో విచారణ జరిపించాలని కొత్తగూడెం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కనుకుంట్ల కుమార్ అన్నారు. సోమవారం పాత కొత్తగూడెంలోని ఖాళీ స్థలంలో కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కబ్జాలకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టులు చేయాలని కేసులను పెట్టాలని డిమాండ్ చేశారు. తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు కాపా కృష్ణమోహన్, నాయకులు రామకృష్ణ దొర, కళ్యాణం లక్ష్మీపతి, కొండస్వామి, ఎండీ.సర్వార్, బోల్లోజు చారీ, అక్బర్ పాషా, మన్నెపల్లి కోటయ్య, మండప సురేష్, ఎండీ తాజ్, ఆనంద్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టై, బెల్టుల వితరణ

టేకులపల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సులానగర్ గ్రామానికి బోడ రమేష్ నాయక్ టై, బెల్టులను వితరణ చేశాడు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై గన్‌రెడ్డి రమణారెడ్డి, విద్యుత్ ఏఈ దేవా వాటిని విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం బాణోతు లక్ష్మా, ఉపాధ్యాయులు భాస్కర్‌రావు, రవీందర్, అన్నపూర్ణ, పద్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి ఎస్అండ్‌పీసీ ట్రెనింగ్ సెంటర్‌లో 74వ, బ్యాచ్ సెక్యూరిటీ గార్డులకు నిర్వహించిన పునఃశ్చరణ శిక్షణా తరగతులు సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్, ట్రెనింగ్ అధికారి ఎండి.జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.వి.రమణ, కార్పొరేట్ జూనియర్ ఇన్‌స్పెక్టర్లు, సెక్యూరిటీలు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ విడుదల చేయాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని మైనారిటీ గురుకులాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు చెందిన ఈపీఎఫ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సంజీవరావుకు జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా సోమవారం వినతిపత్రం అందజేశారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు అందజేసిన ఈపీఎఫ్ నిధుల బకాయిలు ఇంత వరకు ఉద్యోగులకు అందలేదన్నారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

పాల్వంచరూరల్: కారును వెనుకనుంచి వేగంగా వచ్చి ఢీ కొట్టిన బోలేరో వాహన డ్రైవర్‌పై పోలీసులు సోమవారం కేసు నమోదుచేశారు. ఎస్సై కార్తీక్ తెలిపిన వివరాల ప్రకారం. .జగయ్యపేటకు చెందిన ముక్కపాటి వెంకటేష్ కారులో సోమవారం భద్రాచలం వెళ్తుండగా మండల పరిధిలో పెద్దమ్మగుడి వద్ద వేగంగా వచ్చిన బోలేరో వెనుక నుంచి కారును ఢీ కొనడంతో కారుపాక్షికంగా దెబ్బతింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోలేరో డ్రైవర్ బి.నరేష్‌పై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి

పాల్వంచరూరల్: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ స్థానిక కార్యాలయంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి భూక్యా రవి నాయక్, ప్రశాంత్, మాదారపు లక్ష్మణ్, నరేందర్, వెంకటేశ్, హతిరామ్, కిషోర్, అజయ్, శ్రీను, శేఖర్, కిరణ్, అశోక్ పాల్గొన్నారు.

స్థలాల మంజూరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల్లో 800 మందికి సోమవారం ఇళ్ల స్థలాల పట్టాలల పంచగా లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, కౌన్సిలర్లు చేతివాటం ప్రదర్శించారని పట్టణానికి చెందిన దేవరపల్లి భాస్కర్, అన్నబోయిన తిరుపతిలు కలెక్టర్‌కి ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఇళ్లు లేని పేదలకు, ఎన్నో ఏళ్లుగా కిరాయి ఇళ్లల్లో నివాసం ఉండే వారికి అందాల్సిన స్థలాలు, పక్కా ఇళ్లు ఉన్న వారికి, ఒకే ఇంట్లో ఇద్దరికి, ఉన్నత స్థితి ఉన్న వారికి పట్టాలు అందాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు విచారణ జరిపి నిజమైన నిరుపేదలకు న్యాయం చేయాలని కలెక్టర్‌ని కోరారు.

సమస్యల ప్రాంగణం..!

ఇల్లెందు బస్టాండ్‌లో కనీస వసతులు కరువు

- నీరురాని నల్లాలు, వెలుగని లైట్లు, తిరగని ఫ్యాన్లు
- ఆవరణలో ప్రైవేట్ వాహనాల పార్కింగ్



ఇల్లెందు బస్టాండ్


బస్టాండ్ ఆవరణలో నిలిపిన వాహనాలు


అలంకారప్రాయంగా ఉన్న నల్లాలు

ఇల్లెందు: ఇల్లెందు బస్టాండ్‌లో సమస్యలు తాండవం చేస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో ఆర్టీసీకి నాలుగు రుపాయల ఆదాయం సమకూరే ఏకైక బస్టాండ్ ఇల్లెందే. ఇంతటి ఆదాయ వనరు కలిగిన బస్టాండ్‌పై నిర్లక్ష్యం తగదని ప్రయాణికులు వాపోతున్నారు. బస్టాండ్ ఆవరణలో సౌకర్యాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రయాణికులకు దాహార్తి తీరక నీటి గోస తప్పడం లేదు. ఇక్కడి నల్లాల్లో చుక్క నీరు రావటం లేదు. ఫ్యాన్‌లు కూడా సక్రమంగా తిరగటం లేదు. మూత్రశాలలు, మరుగుదొడ్ల పని చేయటం లేదు. మున్సిపాల్టీ ద్వారా పక్కనే నిర్మించిన వాటిని వాడుకునేలా ఆర్టీసీ వాటిని మరమ్మతు చేయకుండా వదిలేశారు. చిన్న వర్షానికే ఆవరణమంతా నీటిమయంగా మారుతోంది. రెగ్యులర్ కంట్రోలర్ లేని కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. బస్సుల సమాచారం తెలుసుకునేందుకు కనీసం ఫోన్ నంబర్ కూడా అందుబాటులో లేకుండాపోయింది.

ప్రైవేట్ వాహనాలదే ఇష్టారాజ్యం..

ఇదిలా ఉండగా పెవ్రేటు వాహనాలకు పార్కింగ్‌గా మారింది. ఆటోలు, మ్యాజిక్‌లు, ఇతర వాహనాలు బస్టాండ్‌లోకి వచ్చి ప్రయాణికులను తరలించుకు వెళ్తున్నాయి. ఇష్టారాజ్యంగా బస్టాండ్‌లోకి ప్రైవేటు వాహనాలు వచ్చి ప్రయాణికులను తరలించుకు వెళుతుండటంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. అధికారులు ఆదాయం కోసం ఆరాటం పడుతున్నారు కానీ సదుపాయాల కోసం పట్టించుకోవటం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ చుట్టూ పహారీ లేకపోవడంతో క్రమక్రమంగా ఆవరణమంతా ఆటోలు, మ్యాజిక్‌లు, జీపులు, లారీలతో నింపివేస్తున్నారు. అసలే ఇరుకు ప్రదేశం, ఆపై ప్రైవేటు వాహనాలు అడ్డాగా పెట్టి ఇష్టారాజ్యంగా రోడ్డు మీద వాహనాలు నిలపడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. బస్టాండ్‌లోకి వెళ్లే అవుట్, ఇన్ బోర్డులు ఏర్పాటు చేయక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సదుపాయాలు కల్పించాలి



సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులకు కనీస సదుపాయాలు కలిపించాల్సి ఉంది. బస్టాండ్‌లో మంచినీరు, బల్లాలు ఏర్పాటు చేయటం, లైట్లు, ఫ్యాన్లు కాంతులు వెదజల్లేలా చూడటం అధికారుల మీద ఉంది. మరుగు దొడ్లు కూడా ప్రక్కన కొంత దూరంలో ఉండటం, ఉన్నవి పని చేయటకపోవటం వల్ల మూత్రలు శాలలు లేవని ప్రయాణికులు బయటకు వెళుతున్నారు.

– హరికృష్ణ, ఇల్లెందు

హోటళ్లు తెరిపించాలి



బస్టాండ్ ఆవరణలో ఉన్న అన్ని షాపులు, హోటళ్లు తెరిపించాలి. బయటకు వెళ్లి భోజనం చేసి రావటం వల్ల బస్‌లు వెళ్లిపోతున్నాయి. దీంతో గంటల కొద్ది వేచి ఉండాల్సి వస్తోంది. బస్టాండ్‌తో పాటు ఆవరణ కూడా పరిశుభ్రంగా ఉంచాలి. ముఖద్వారం వద్ద వానలు వస్తే నీళ్లు నిలిచి ప్రక్క నుంచి నడుచుకుంటున్న వెళుతున్న ప్రయాణికుల మీద బురద నీరు చిమ్మి పడుతోంది.

– నాయిని సైదులు, ఇల్లెందు

కంట్రోలర్‌ను నియమించాలి



బస్టాండ్‌లో రెగ్యులర్ కంట్రోలర్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. బస్‌ల సమాచారం అందించేలా ఒక ఫోన్ నంబర్‌ను ఏర్పాటు చేయాలి. అవుట్ ఇన్ బోర్డులు కూడా పెట్టాలి. ప్రైవేట్ వాహనాలు లోనికి రాకుండా సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేయాలి. ప్రజలకు ఉపయోగపడేలా సదుపాయాలు కల్పించాలి..

– చింతా ఉపేందర్, సుదిమళ్ల, ఇల్లెందు మండలం

ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం..



ఇల్లెందు: మాట్లాడుతున్న రామలింగేశ్వరరావు

ఇల్లెందు: బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామలింగేశ్వరరావు అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఏర్పాటైన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తోర్తి జాన్, విలియం ప్రసాద్ పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పిజీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిహెచ్ శారద మాట్లాడుతూ... చదువుతోపాటు సమాజసేవలో భాగస్వామ్యం చేయడానికి, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడానికి ఎన్ఎస్ఎస్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థినులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు జి సునీత, కె ఆశాజ్యోతి, సిహెచ్ సుమలతలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచి వారి సమస్యలు పరిష్కరించాలని ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్‌షావలి, సహాయ కార్యదర్శి పి. సతీష్‌లు యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కార్పొరేట్ ఏరియా పరిధిలోని రైటర్‌బస్తీలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులపై శ్రమ దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతుందన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30 వరకు అధికారులకు వినతులు అంతజేత, అక్టోబర్ 1 నుంచి 10 వరకు పీవో, జీఎం కార్యాలయాల ఎదుట ఆందోళన, అక్టోబర్ 13న సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం కార్పొరేట్ కార్యాయంలో సివిల్ అధికారి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగలక్ష్మీ, చంద్రకళ, కృష్ణ, విజయ, భగవాన్, రామకృష్ణ, శిరిష, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఇల్లెందు: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటర్లుగా నమోదై ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామలింగేశ్వరరావు సూచించారు. కళాశాల ఆవరణలో సోమవారం ఓటరు నమోదు, ఓటు హక్కు సద్వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు తోర్తి జాన్, విలియమ్ ప్రసాద్, మున్సిపల్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ రామస్వామి, వెంకటేశ్వర్లు, అన్వేష్, వెంకట్ పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా పోస్టులు పెడితే చర్యలు

టేకులపల్లి: సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై గన్‌రెడ్డి రమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక మాధ్యమాన్ని సక్రమంగా వాడుకోవాలని అలా కాకుండా ఒక వ్యక్తికి సామాజిక వర్గానికి, రాజకీయల పార్టీల స్వేచ్ఛ, భద్రతకు గౌరవానికి భంగం కలిగేవిధంగా పోస్టులు వీడియోలు పెట్టినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రూ.5 కోట్ల రుణమాఫీ నిధులు జమ


మాట్లాడుతున్న హనుమంతరావు

చుంచుపల్లి: కొత్తగూడెం సొసైటీ పరిధిలో రూ.5 కోట్ల మేరా రైతులకు రుణమాఫీ నిధులు జమ చేయడం జరిగిందని సొసైటీ అధ్యక్షుడు మండే హనుమంతరావు తెలిపారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో పాలక వర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ అయిన రైతులు పట్టదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లు అందజేసి రుణం తీసుకోవాలన్నారు. ఇంకా మిగిలిన రూ. 5 కోట్ల రుణమాఫీ నిధులను వెంటనే విడుదల చేయాలని సంబంధిత అధికారులను కోరుతూ తీర్మానం చేశామన్నారు. ఈ సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కూచిపూడి జగన్నాథరావు, డైరెక్టర్ వెల్పుల మల్లేష్, బండి అమృతరావు, గుగులోతు చందర్, తీట్ల విజయకుమారి, పొటు వెంకటేశ్వరరావు, చంద్రగిరి శ్రీనివాస్ రావు, గుగులోతు విజయ, సొసైటీ సెక్రటరి పండ్ల సారయ్య పాల్గొన్నారు.

పాఠశాలలో మినీ ఆర్వోప్లాంట్

టేకులపల్లి: మండలంలోని ముత్యాలంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1977–1987 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మినీ ఆర్‌ఓప్లాంటును ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మంగీలాల్, సర్పంచ్ రమాదేవి, కార్యదర్శి లక్ష్మీనారాయణ, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

గ్రూప్స్ అభ్యర్థులకు రూ.లక్ష పరిహారమివ్వాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): అవినీతికి అడ్డాగా మారిన టీఎస్పీఎస్సీ బోర్డును రద్దు చేయాలని, గ్రూప్స్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఒక్కొక్కరికీ రూ.లక్ష పరిహారం చెల్లించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర పిలుపులో భాగంగా సోమవారం ప్ల కార్డులతో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యోగాల కోసం ఎదురు చూసే వారి నోట్లో మట్టి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కేసుపాక వెంకటరమణ, జిల్లా ప్రధానకార్యదర్శి గాడిద దామోదర్, జిల్లా సలహాదారు గంధం మల్లిఖార్జునరావు, జిల్లా మహిళా కన్వీనర్ బండి రమణి, జిల్లా కార్యదర్శి తంబర్ల నరసింహారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా..



ధర్నా చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జీఓ 142ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వైద్య ఆరోగ్య సంఘాల పిలుపు మేరకు సోమవారం ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... జీఓను రద్దు చేయకపోతే అక్టోబర్ 3న హైద్రాబాద్‌లోని డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు బానోత్ నాగేశ్వరరావు, గొంది వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, శ్రీనివాసరావు, రమేష్, సుశీల, జానకి, కృష్ణయ్య, లాలు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికులు..

సమస్యల పరిష్కరించాలని మధ్యాహ్న కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కోటి సంఘీభావం తెలిపారు. నాయకులు పూర్ణచందర్‌రావు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దాసుల పుష్పవతి, కార్యదర్శి ఎస్ విజయలక్ష్మి, రాధ, ప్రభావతి, మంగ, వెంకటమ్మ పాల్గొన్నారు.

పరుగులు పెడుతున్న అభివృద్ధి

- ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: అన్నదాతకు అండగా నిలుస్తూ సంక్షేమ, అభివృద్ధి పథకాలను పరుగులు పెట్టించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, పంచాయతీ కార్యాలయ భవనాలకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏర్పాటైన సమావేశాలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాగునీటి వనరుల అభివృద్ధి, రైతుబంధు, రైతుబీమా, నిరంతర ఉచిత విద్యుత్ వంటి పథకాలతో అన్నదాతకు భరోసానిస్తూ వారి మోమున చిరునవ్వే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతీగడపకూ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజారంజక పాలనను సీఎం కేసీఆర్ అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, వైస్ ఎంపీపీ ప్రమోద్‌కుమార్, సర్పంచ్‌లు సూర్నపాక రామయ్య, తాటి మౌనిక, గుగులోత్ అంబాలి, కృష్ణ, పంచాయతీరాజ్ డీఈ రామకృష్ణ, ఏఈ రాజు, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షకార్యదర్శులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, లష్కర్, సృజన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం


బ్రోచర్‌ను పంపిణీ చేస్తున్న కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: ప్రజలకు మేలు చేసే విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేయగలిగే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. మండలంలోని సుభాష్‌నగర్ గ్రామ పంచాయతీలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. సోనియా గాంధీ ప్రకటించిన ఆరు హామీలను అర్థమయ్యేలా వివరిస్తూ ప్రత్యేకంగా ముద్రించిన బ్రోచర్‌ను ప్రతీ ఇంట్లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు హామీలపై ప్రజల నుంచి మంచి స్పందన కనిపిస్తోందని చెప్పారు. కాంగ్రెస్ పరిపాలన కాలంలో ఉన్న స్వేచ్ఛ నేడు ప్రజలకు కొరవడిందని వాపోయారు. అంతకు ముందు సుభాష్‌నగర్ రామాలయంలో, గణేశ్ మండపలాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ శాఖల అధ్యక్షులు పులి సైదులు, దొడ్డ దానియేలు, ప్రధాన కార్యదర్శి ఆరెం కిరణ్, నాయకులు యదళ్లపల్లి అనసూర్య, జాఫర్, కిన్నెర నర్సయ్య, నాలవెల్లి నర్సింహారావు, చెన్నూరి కృష్ణ, పాయం స్వాతి, కల్తి పద్మ, పాయం లలిత, శారద, మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, ముక్తి కృష్ణ, తాటి భిక్షం, ధనుంజయ్, ప్రసన్నకుమార్, జెమిని, ఐలయ్య, సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒప్పందాల అమలులో విఫలం


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): గతేడాది సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు చేపట్టిన 18 రోజుల సమ్మె సందర్భంగా సెంట్రల్ డిప్యూటీ లేబర్ కమిషనర్ సమక్షంలో కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాలను సింగరేణి యాజమాన్యం అమలుచేయటంలో విఫలమయిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం జీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత సమ్మె సందర్భంగా కార్మికులకు వేతనాలు, కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం బోనస్ పెంపు అంశాలపై సింగరేణి యాజమాన్యం అంగీకరించి ఒప్పందంపై సంతకాలు చేశారని, ఏడాది గడిచినప్పటికీ వాటిని అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారన్నారు. హామీలు అమలు చేయకుంటే మరో సమ్మెకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్రిష్టాఫర్, కాంట్రాక్ట్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

చర్చి స్థలంలో గుడిసెలు తొలగించాలి

జూలూరుపాడు: స్థానిక ఆర్‌సీఎం చర్చి స్థలంలో కొందరు వ్యక్తులు వేసిన గుడిసెలను తొలిగించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌సీఎం చర్చి ఫాదర్ బంధనాల శౌరి ఆధ్వర్యంలో సోమవారం మండలకేంద్రంలోని చంద్రుగొండ క్రాస్ రోడ్డుపై క్రైస్తవులు బైఠాయించి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఫాదర్ శౌరి మాట్లాడుతూ... మండలకేంద్రానికి చెందిన కాకటి వీరయ్య, కాకటి మైసయ్యలు చర్చి కోసం భూమి దానం చేశారని, కొన్నేళ్ల తరువాత వారి కుటుంబీకులు స్థలానికి అడ్డం తిరగడంతో అప్పుడు కొంత డబ్బును ముట్టజెప్పామన్నారు. నెల రోజుల క్రితం వీరయ్య, మైసయ్య కుటుంబీకులు చర్చి స్థలంలో గుడిసెలు వేశారని, ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. అదే సమయానికి కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళ్తున్న మాజీ ఎంపీ, తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగి ఇరువర్గాలతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా చూడాలని సీఐ శ్రీనివాస్‌కు తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానడంతో ఆందోళన విరమించారు. ఈ మేరకు ధర్నాతో ప్రజలకు అంతరాయం కలిగించినందుకు 8 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పారిశుద్ధ్య కార్యక్రమం


చెత్త తొలగిస్తున్న కార్మికులు

సుజాతనగర్: 'స్వచ్ఛతా హీ సేవ' పక్షోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో సోమవారం పారిశుద్ధ్య కార్మికులతో చెత్త చెదారాన్ని తొలగించారు. ఇళ్ల పరిసరాలలో నీటి నిల్వలు, చెత్త చెదారం లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి బి.నరేందర్ తెలిపారు.

గణేశ్ మండపాల్లో పూజలు, అన్నదానాలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండపాల్లో గణపయ్యను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. – సాక్షి నెట్‌వర్క్


పాల్వంచ: గణేశ్ మండపంలో పూజలు చేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి


ఇల్లెందులో..


టేకులపల్లి: అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై రమణారెడ్డి


పాల్వంచరూరల్: దివ్యాంగుల కాలనీలో..


కొత్తగూడెంటౌన్: మదురబస్తీలో..


ఇల్లెందురూరల్: అన్నదానంలో భక్తులు